
సీఎంకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ పరిశ్రమ పర్యవేక్షణకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు అక్కడికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సోమవారం సీఎం వస్తున్న సందర్భంగా తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కలెక్టరేట్ సమీపంలోని కంపెనీ వరకు రోడ్లను శుభ్రం చేశారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. సంస్థ పురోగతి, ఇతర అంశాలను అక్కడి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లియూతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయలను కల్పిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. సీఎం వెంట శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, తెలంగాణ పట్టణ, ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, తదితరులున్నారు.

నాడు ఆదర్శం.. నేడు అస్తవ్యస్తం

హాజిపల్లి గ్రామంలో పడకేసిన పారిశుధ్యం


గ్రామంలో పారుతున్న మురుగు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సంపూర్ణ పారిశుధ్యం సాధించి నిర్మల్ గ్రామ పురస్కారం అందుకున్న ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామంలో నేడు ఎక్కడ చూసినా మురుగు, చెత్తాచెదారం దర్శనమిస్తుంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామంలో పారిశుధ్యం గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. రోడ్లపైనే మురుగు పారుతుండటంతో గ్రామస్తులు కంపును భరించలేకపోతున్నారు. గుంతల్లో నీరు నిలిచి దోమలకు నిలయాలు మారాయి.

హాజిపల్లి సర్పంచ్‌గా చెదురుపల్లి జంగమ్మ హయాంలో గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందింది. స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచిన గ్రామం కేంద్ర ప్రభుత్వం ప్రకటించే నిర్మల్ గ్రామ పురస్కారానికి ఎంపికైంది. నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా జంగమ్మ ఈ అవార్డును అందుకున్నారు. దేశం నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్‌డీలో శిక్షణ నిమిత్తం వచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజిపల్లి గ్రామాన్ని సందర్శించేవారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి వారు ఆశ్చర్యపోయేవారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనే కృష్ణా నీరు తాగిన గ్రామంగా హాజిపల్లి పేరుగాంచింది. అలాంటిది ప్రస్తుతం గ్రామంలో చెత్తాచెదారం పేరుకపోయి అపరిశుభ్రంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బంట్వారంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

ఏదీ బీ(ధీ)మా!

పత్తాలేని పంటల బీమా పథకం


- అమలు కాని ఫసల్ బీమా యోజన
- నాలుగేళ్లుగా అందని నష్టపరిహారం
- తీవ్రంగా నష్టపోతున్న ఉమ్మడి జిల్లా రైతులు
- కొత్త ప్రభుత్వం వచ్చినా మారని పరిస్థితి


ఆంధ్రజ్యోతి SURVEY సర్వే

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చే సమయానికి అతివృష్టి, లేదా అనావృష్టి కారణంగా రైతుల చేతికిరాకుండా పోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ఉండడానికి ప్రభుత్వాలు పంట బీమా పథకాలను తీసుకొచ్చాయి. కానీ ఈ బీమా గురించి ఉమ్మడి జిల్లాలోని మూడింట ఒక వంతు మంది రైతులకు కనీస అవగాహన లేని పరిస్థితి. ఈ బీమా పథకం రైతులకు ఏ విధంగా అందుతోంది? అధికారులు ఏ మేరకు నష్టాన్ని కచ్చితంగా అంచనా వేస్తున్నారు. తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5700 మంది రైతులతో మాట్లాడి (సర్వే ద్వారా) 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించింది.

ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంటల బీమా పథకంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే చేపట్టింది. ఒక్కో నియోజకవర్గం నుంచి 570 మంది చొప్పున మొత్తం 5,700 మంది రైతులను కలవడం జరిగింది. అందులో వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో 2,280 మంది రైతులు, రంగారెడ్డిలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో

మిగతా 7వ పేజీలో...






ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

'ప్రజావాణి'కి 40 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజావాణి'కి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 40 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వివిధ శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులపై స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు నేడు కౌన్సెలింగ్




రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024లో ఎంపికై ఈనెల 10వ తేదీన రిపోర్టు చేసిన అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో సుశీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మూడు పాస్ ఫొటోలు, నియామక ఉత్తర్వును (ఒరిజినల్ ఆర్డర్ కాపీని) తీసుకొని రావాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన క్యాడర్, అన్ని ఉర్దూ మీడియం కేటగిరీల అభ్యర్థులకు కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం (2వ అంతస్తు, ఎస్-2)లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అన్ని మీడియంల సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) అభ్యర్థులు గ్రౌండ్ ఫ్లోర్‌లోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ట్రాక్టర్ శబ్ధం వింటే పూనకమే!

ఓ కొండముచ్చు ప్రతీకారం

- ఎవరు అడ్డొచ్చినా అంతే సంగతి
- రెచ్చిపోయి గాయపరుస్తుంది
- భయాందోళనలో మధురాపురం



షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మామూలుగా మనుషుల మధ్యే పగలు, ప్రతీకారం ఉంటాయంటారు. కానీ కొండముచ్చులు (కొండంగి) కూడా ప్రతీకారం తీర్చుకుంటాయనడం కొంత హాస్యాస్పదంగానే ఉంటుంది. తనతో తిరిగిన ఓ కొండముచ్చు ట్రాక్టర్ ప్రమాదంలో చనిపోయింది. అప్పటి నుంచి మరో కొండముచ్చు ప్రతీకారం రగిలిపోతుంది. ట్రాక్టర్ శబ్ధం వినిపిస్తే చాలు రెచ్చిపోతుంది. ఎవరు అడ్డొచ్చినా దాడి చేసి గాయపరుస్తుంది. దీంతో ఆ ప్రాంత ట్రాక్టర్ డ్రైవర్లు, గ్రామస్థులు భయం భయంతో గడుపుతున్నారు.

ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురం గ్రామంలో పదేళ్ల నుంచి కొండముచ్చులు తిష్టవేశాయి. పెంకుటిళ్లు, రేకుల ఇండ్లను ధ్వంసం చేస్తూ రచ్చ చేస్తున్నాయి. ఈ క్రమంలో కొన్నినెలల క్రితం మధురాపురం గ్రామసమీపంలోని శేరిగూడ గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని ఒక కొండంగి మృతి చెందింది. అప్పటి నుంచి మరో కొండముచ్చు ట్రాక్టర్ల శబ్ధం వింటేచాలు పగతో రగిలిపోతుంది. కనిపించిన ప్రతీఒక్కరిపై దాడి చేస్తూ గాయపరుస్తుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండంగి భయానికి ట్రాక్టర్ డ్రైవర్లు కర్రలు పక్కన పెట్టుకుని డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇన్నాళ్లు శేరిగూడ గ్రామస్థులపై దాడి చేసిన కొండముచ్చు.. ఇటీవల పక్కనే ఉన్న మధురాపురం గ్రామంలో మకాం వేసింది. అక్కడ పది మందికి పైగా గాయపరిచింది. తాజాగా ఓ ఇంటి వద్ద చెత్త ట్రాక్టర్‌పై చెత్తవేయడానికి వెళ్లిన మల్కయ్యగారి ప్రభావతమ్మపై కొండంగి దాడి చేసింది. దీంతో ఆమె ఆస్పత్రి పాలైంది. అలాగే గ్రామంలో నాగులు, నవగ్రహాలు, శివలింగం, నందీశ్వరుడి విగ్రహాల ప్రతిష్టాపనలో భాగంగా ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహిస్తుండగా ఏళ్ళ ప్రకాష్‌రెడ్డి అనే యువకుడిపై కొండముచ్చు దాడి చేసి గాయపరిచింది. ఇలా గ్రామంలోని చాలా మందిపై దాడి చేస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం పక్కన ఉన్న చింతచెట్లపై మకాం వేసిన కొండముచ్చులు అటుగా వెళ్తున్న ఎవరినీ వదలడం లేదు. ఈ విషయమై అటవీశాఖ అధికారులు స్పందించి వాటిని గ్రామం నుంచి తరిమేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెత్తవేస్తుంటే దాడి చేసింది



ఇంటి వద్దకు వచ్చిన ట్రాక్టర్‌లో చెత్తవేస్తుండగా కొండంగి దాడి చేసింది. నా కుడి చేతికి తీవ్రగాయమైంది. కింద పడడంతో ఎడమ చేతికి కూడా దెబ్బ తగిలింది. ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాను. పక్కన వారందరూ అరవడంతో కొండముచ్చు పారిపోయింది. లేదంటే నా ప్రాణం పోయేది.

- మల్కయ్యగారి ప్రభావతమ్మ

దామగుండం రెడీ!

నేవీ రాడార్ స్టేషన్‌కు నేడు శంకుస్థాపన

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు


కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

వికారాబాద్, ప్రతినిధి /పూడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో దామగుండం పేరు అంతర్జాతీయ చిత్రపటంలో చేరనుంది. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేసే విషయాన్ని కేంద్ర రక్షణ శాఖ, భారత నావికాదళం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. గత 14 ఏళ్లుగా న్యాయ పోరాటాలను అధిగమించి ఎట్టకేలకు నేవీ రాడార్ స్టేషన్ కార్యరూపం దాల్చే వరకు చేరుకుంది. దామగుండం నేవీ రాడార్ కేంద్రం నిర్మాణం పనులకు మంగళవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ భద్రత, నిఘా, సెక్యూరిటీ వింగ్ అధికారులతో పాటు వికారాబాద్ జిల్లా పోలీసులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, సంగారెడ్డి జిల్లా పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. బందోబస్తు విధులకు సంబంధించి మన్నేగూడ జేకే ఫంక్షన్ హాల్‌లో పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దామగుండంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్ దేశంలోనే రెండవది. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్‌ఎస్ కట్టబొమ్మన్ మొదటి వీఎల్‌ఎఫ్ స్టేషన్ 1990 నుంచి నావికా దళానికి

మిగతా 7వ పేజీలో...

చకచకా ఆస్పత్రి నిర్మాణం

- పూర్తయిన బేస్మెంట్ పనులు
- ఆరు నెలల్లో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు
- రూ.17.5 కోట్ల నిధులు మంజూరు

8



మినీ స్టేడియం ఏర్పాటు ఎప్పుడో?

- ప్రతిపాదనలకే పరిమితం
- అమలుకాని నేతల హామీలు
- మైదానాలు లేక అవస్థల్లో క్రీడాకారులు

8



స్పెషల్ బాదుడు!

దసరాకు ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీల మోత

» టికెట్ ధరపై డబుల్ వసూలు » ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


అదనంగా వసూళ్లు చేసిన టిక్కెట్



ఆమనగల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ అదనపు బాదుడుకు తెరలేపింది. ప్రత్యేక బస్సులు పేరిట ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తుంది. టికెట్ల ధరల పెంపుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణమని, ఆదాయం కోసం పురుషుల నుంచి ఎక్కువ పైసలు వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గతంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు రూ.140 చార్జి ఉండేది. స్పెషల్ బస్సుల పేరుతో రూ.210 వసూలు చేస్తున్నారు. అదేవిధంగా కల్వకుర్తి నుంచి ఆమనగల్లుకు గతంలో రూ.40 చార్జి ఉండేది. ఇప్పుడు దానిని డబుల్ చేస్తూ ఏకంగా రూ.80 వసూలు చేస్తున్నారు. ఈ చార్జీలను చూసి.. ఇదేం బాదుడు బాబోయ్ అంటూ ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. అదనపు చార్జీల భారం మోయలేక కొందరు కండక్టర్లతో గొడవ పడిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. దసరా పండగ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బంది లేకుండా చూడాల్సిన ఆర్టీసీ.. ఇలా అదనపు భారం మోపడం సరికాదంటున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



గుంపులుగా వెళ్తున్న కుక్కలు

కేశంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ.. దాడులకు తెగబడుతున్నాయి. దీంతో ప్రజలు వాటిని చూస్తేనే బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా మండలపరిధిలోని కేశంపేట, కొత్తపేట, వేముల్‌నర్వ, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం, తొమ్మిదిరేకుల, లింగంధన, కాకునూర్ గ్రామాల్లో వీధి కుక్కలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. వాహనలపై వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పౌల్ట్రీ యాజమానులు చనిపోయిన కోళ్లను ఆరుబయట పడవేయడంతో పాటు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు మాంసాన్ని ఎక్కడ పడితే అక్కడ పడి వేస్తుండటంతో కుక్కల సంచారం ఆ ప్రాతంలో ఎక్కువగా ఉంటుంది. మాంసానికి అలవాటు పడిన కుక్కలు మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. అలాగే లేగదూడలపై దాడుల చేసి చంపి తింటున్నాయి. కుక్కల నియంత్రణ లేకపోవడంతో గ్రామాలలో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగింది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీధి పోటు అంటూ రోడ్డుపై గోడ నిర్మాణం



మేడ్చల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని ఎన్‌జీవో కాలనీలో ఇంటికి వీధిపోటు తగిలి వాస్తులోపం కలిగిందంటూ ఓవ్యక్తి నేరుగా రోడ్డుపై ప్రీకాస్టింగ్ గోడను కట్టేశాడు. అసలే కాలనీ రోడ్లు తక్కువ వెడల్పుగా ఉండటంతో ఒక బండి ముందుకుపోతే ఇంకో బండి ముందుకు రాని పరిస్థితి. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న రోడ్డుపై విచ్చలవిడిగా గోడ నిర్మించటంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పట్ల స్థానిక కౌన్సిలర్‌కు, మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ గోడను మాత్రం తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో చేవేళ్ల, తాండూర్ ఎమ్మెల్యేలు

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సోమవారం రాత్రి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దామగుండం జేఏసీ నాయకులు

రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వికారాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దామగుండం పరిరక్షణ జేఏసీ నాయకులు గీత, ఆనంద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టిన అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఇక్కడ రాడార్ సెంటర్ ఏర్పాటుతో వృక్షసంపద అంతరిస్తుందని, పక్షులు, మానవాళికి సైతం ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్‌ను మరో చోటుకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు మల్లేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, వెంకటయ్య, నర్సిములు, రాములు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

రైతు, ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

తాండూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కార్యాలయానికి వచ్చిన రైతుల, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో ధరణికి సంబంధించిన సమస్యల పరిష్కారం గురించి తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు సమస్యలతో వస్తే వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయం చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా మాట్లాడి వారి సమస్య తెలుసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు ఉన్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు



ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు(ఫైల్)

మర్పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన ఎర్ర ఏసుదాస్, యశోద దంపతులకు నలుగురు సంతానం. పెద్ద కుమార్తె నర్సుగా ఉద్యోగం చేస్తుంగడా కుమారుడు ప్రశాంత్‌కుమార్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కానీ ఎప్పటికైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఇటీవలే విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా చిన్న కుమార్తె మేఘన, కోడలు అశ్విని ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా ఉద్యోగాలు సాధించారు. ఇటీవలే హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వారు నియామక పత్రాలు అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు.



చెరువులకు జలకళ

బషీరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు జలకళ సంతరించుకొని కళకళలాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లోకి పెద్ద మొత్తంలో వరద నీరు చేరింది. మండలంలోని నవాల్గ నల్లచెరువు నిండుకుండలా మారి రెండో సారి అలుగు పారుతోంది. నవాంద్గీ పెద్ద చెరువు, కాశీంపూర్ బీరప్ప చెరువు, మంతన్‌గౌడ్ ఊర చెరువులతో పాటు, మైల్వార్ అక్కులమ్మ, ఎల్లమ్మ, దామర్‌చెడ్ చెరువుల్లోకి ఎగువన అటవీ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది యాసంగి ఆయకట్టు సాగుకు ఇక ఢోకాలేదని ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే సబితని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

నవాబుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని మండల బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, విజయ్, మొహ్మద్‌గౌస్, దయాకర్‌రెడ్డి, శాంతికుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏదీ బీ(ధీ)మా!

(5వ పేజీ తరువాయి)

మొత్తం 2,850 మంది రైతులు, మేడ్చల్ నియోజకవర్గంలో 570 మంది రైతులను కలిసి పంటల బీమా పథకంపై సమగ్ర సర్వే నిర్వహించారు. రైతులకు పంట బీమా గురించి తెలుసా అని అడిగిన ప్రశ్నకు తెలుసునని 2,763 మంది సమాధానం చెప్పగా, తెలియదని 1,815 మంది సమాధానం ఇచ్చారు. ఈ సర్వే వివరాలను గమనిస్తే రైతులకు పంటల బీమాపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమైనట్లు తెలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టి ఏర్పడి నష్టపోతే అధికారులు సర్వేను సమగ్రంగా చేపట్టడం లేదని 2,997 మంది చెప్పారు. అధికారులు గ్రామాలకు వెళ్లి పంటలను సందర్శించకుండా చెట్ల కింద కూర్చొని పంట నష్టాన్ని రాసుకుని వెళ్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు. దీంతో నిజంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందడం లేదు. పంట నష్టం అంచనా వేయడం కూడా సరిగ్గా లేదంటున్నారు. పంట నష్టం అంచనా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలని అధిక సంఖ్యలో రైతులు చెబుతున్నారు. పంట నష్టపోయిన సమయంలో బీమా సొమ్మును సకాలంలో ప్రభుత్వమే చెల్లించాలని 4,206 మంది రైతులు తెలిపారు.

ఫసల్ బీమా నుంచి తప్పుకున్న ప్రభుత్వం


ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ఈ పథకం 2019-20 వరకు రాష్ట్రంలో కొనసాగింది. 2020లో ఈ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకుంది. అప్పటి నుంచి పంట బీమా పథకం లేకపోవడంతో విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులు పరిహారాన్ని అందుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సాగవుతున్న పంటలకు ప్రభుత్వం ధీమాను ఇవ్వలేకపోతుంది. ప్రధాన మంత్రి పసల్ బీమా పథకం నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రత్యేక బీమా పథకాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంత వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అమలవుతున్న బీమా పథకం తరహా ఇక్కడా తీసుకొస్తామని, అందుకు ఒక బృందం అక్కడికి వెళ్లి అధ్యయనం చేసి వచ్చిన తర్వాత నూతన బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆతర్వాత దాని ఊసే ఎత్తలేదు. ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతులకు బీమా రాక పెట్టుబడి లేక తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



వికారాబాద్ జిల్లాలో నీట మునిగిన పత్తి పంట(ఫైల్)

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

రంగారెడ్డి జిల్లాలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా యోజన కింద 2018 ఖరీఫ్‌లో 25,650 మంది రైతులు 52,997 ఎకరాల విస్తీర్ణంలో నమోదు చేసుకున్నారు. 2019 సంవత్సరంలో 32,535 మంది రైతులు 61,232 ఎకరాల విస్తీర్ణంలో పంటలను నమోదు చేసుకున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, కంది, జొన్న, పత్తి, టమాట, శనగ, వేరుశనగ పంటలకు బీమా చేయించారు. సాధారణంగా ఫసల్ బీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిపి 95 శాతానికి పైగా బీమా ప్రీమియం చెల్లిస్తుండగా, మిగితా 1.5 శాతం నుంచి 5 శాతం వరకు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర సబ్సిడీతో పాటు రైతుల తరఫున ప్రీమియం సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ నుంచే ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటికే సగం సీజన్ దాటి పోయింది అయినా దాని ఊసే లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో 1,591 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 991 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వికారాబాద్‌లో 600 ఎకరాల విస్తీర్ణంలో పంటలు నీట మునిగాయి. అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినప్పటికీ పరిహారం మాత్రం రాలేదు. పంట బీమా పథకం లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పి ఇంత వరకూ కనీస మార్గదర్శకాలు విడుదల చేయని పరిస్థితి.



బీమా పాలసీ ఊసే లేదు

కొన్నేళ్లుగా పంటల బీమా పథకం అమలు కావడం లేదు. గత ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా అమలు చేసినప్పటికీ.. పంట బీమాను పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమాను ఉచితంగా అమలు చేస్తామని చెప్పింది. కానీ.. ఇంత వరకు ఆ ఊసేలేదు. పంట నష్టం జరిగినప్పుడు అధికారులు పంటల వారీగా అంచనా వేసి పరిహారం త్వరగా ఇవ్వాలి.

- రూపం వెంకట్‌రెడ్డి, రైతు, చింతలపలి(ఆమనగల్లు)

నేడు తాండూరులో ఎంపీ రఘునందన్‌రావు పర్యటన

తాండూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ పార్లమెట్ సభ్యుడు, బీజేపీ సభ్యత్వ నమోదు జోనల్ ఇన్‌చార్జి రఘునందర్‌రావు ఈనెల 15వ తేదీన (నేడు)న తాండూరులో పర్యటించినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణశాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భద్రేశ్వర్‌చౌక్‌లో ఉదయం 10.30 గంటలకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రచారి అభయ్ పాటిల్ ఆదేశానుసారం ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. తాండూరు నియోజకవర్గ బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో కౌన్సిలర్ కన్నుమూత



హిమ (ఫైల్)

ఘట్‌కేసర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ బైర హిమ(53) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఇటీవల ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన హిమ అక్కడి నుండే 8వవార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. కాగా హిమది యాదాద్రి- భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామం కాగా పోచారం మున్సిపాలిటీ అర్జీకేకాలనీలో నివాసముంటున్నారు. నేడు మంగళవారం స్వగ్రామం గౌరాయపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కూతుళ్లు, ఐదు నెలల కుమారుడు ఉన్నారు. కౌన్సిలర్ హిమ మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితోపాటు సహచర కౌన్సిలర్లు ఆస్పత్రికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

నేడు రేణుకా ఎల్లమ్మ కల్యాణం

శామీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం నేడు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలోని బొడ్రాయి, గ్రామ దేవతలకు బోనాలను నిర్వహించారు. సాయంత్రం గంగతెప్పను డోలు వాయిద్యాలతో ఊరేగించి ఆలయం వద్ద నీటిలో వదిలారు. మంగళవారం(నేడు) ఉదయం ఘటం తీయుట, లందకు వెల్లుట నిర్వహించనున్నారు. అనంతరం 11.45గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దామగుండం రెడీ!



(5వ పేజీ తరువాయి)

సేవలందిస్తుండగా, వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో 2వ వీఎల్‌ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ఏర్పాటు చేయబోతున్నారు. రూ.2500 కోట్లతో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్‌ను 2027 నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని కేంద్ర రక్షణ శాఖ భావిస్తోంది.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని దామగుండం అటవీ ప్రాంతంలో వీఎల్‌ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కేంద్ర నావికా దళ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మంగళవారం నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి జాతీయ భద్రత, నిఘా, సెక్యూరిటీ వింగ్ అధికారులు, నేవీ అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం శంకుస్థాపన జరిగే స్థలంతో పాటు వికారాబాద్ కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి పాల్గొన్నారు.

నిరసనలు

దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో నౌకాయాన దళం వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి వేగంగా చర్యలు చేపడుతుండగా, మరోవైపు రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం వికారాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. అయితే రాడార్ స్టేషన్ ఏర్పాటులో తీసుకుంటున్న నష్ట నివారణ చర్యలను పరిశీలించి సంతృప్తి చెందిన తరువాతనే రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోద ముద్ర పడిందని అధికారులు చెబుతున్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

పరిగి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగుండం అటవిలో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపనను కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేయనున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కంటే ముందుగా రానున్నారు. 11.15 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి బేగంపేట్ ఎయిర్‌పోర్టులో హెలికాప్టర్ ద్వారా వికారాబాద్ కలెక్టరేట్‌కు 11.55కు రానున్నారు. 11.55 నుంచి 12.30 గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి 12.45కు శంకుస్థాపన చేసే దామగుండం స్థలానికి చేరుకుంటారు. 12.45 నుంచి 1.45 వరకు నేవీరాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన, వేదికపై ప్రసంగం ఉంటుంది. తిరిగి రెండు గంటలకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో హెలిప్యాడ్ స్థలానికి చేరుకుంటారు. 2.15 గంటలకు వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో 2.45కు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

తాండూరు మీదుగా మరో రెండు రైళ్లు

తిరుపతికి స్పెషల్ ట్రైన్ • ప్రయాణికులకు మరింత సౌకర్యం

తాండూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాండూరు మీదుగా మరో రెండు స్పెషల్ రైళ్లు ప్రారంభమయ్యాయి. 2025 మార్చి వరకు ఈ రైళ్లు తాండూరు మీదుగా రాకపోకలు సాగించేలా దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయించింది. బెల్గావి నుంచి మణుగురు (రైలు నం. 07335), మణుగురు నుంచి బెల్గావి (రైలు నం. 07336), జల్నా టు తిరుపతి(రైలు నం.07621) తిరుపతి టు జల్నా (07622) రైళ్లను తాండూరు మీదుగా నడిపించాలని దక్షణ మధ్య రైల్వే శాఖ అధికారులు నిర్ణయించారు. బెల్గావి (07335) నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు వారంలో ఆది, బుధ, శని, మంగళవారాలు మణుగురు (07336)లో ప్రారంభమయ్యే రైలు సోమ, గురు, ఆది, బుధవారం తాండూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంది. జల్నా (07621) నుంచి ప్రారంభమయ్యే స్పెషల్ రైలు అక్టోబర్ 20, 27 నవంబర్ 3, తిరుపతి నుంచి ఈ నెల 21, 28 నవంబర్ 4న రాకపోకలు సాగిస్తుందని దక్షణ మధ్య రైల్వే పేర్కొంది. మణుగురు బెల్గావి ట్రైన్‌కు 18 కోచ్‌లుంటాయి, జల్నా - తిరుపతి ట్రైన్‌కు 18 కోట్‌లుంటాయి.

తిరుపతి - జల్నా ట్రైన్ టైమింగ్..

తిరుపతి (07622) రాత్రి 9.10 గంటలకు ప్రారంభమై సరిహద్దు కర్ణాటక సేడం స్టేషన్‌కు ఉదయం 6.43గంటలకు, వికారాబాద్ స్టేషన్‌కు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుంది. జల్నా నుంచి రాత్రి 7.21గంటలకు ప్రారంభమై బీదర్ స్టేషన్‌కు ఉదయం 4 గంటలకు, జహీరాబాద్ స్టేషన్‌కు 4.38గంటలకు, వికారాబాద్ స్టేషన్‌కు 5.30గంటలకు, తాండూరు స్టేషన్‌కు 6.13గంటలకు, కర్ణాటకలోని సేడం స్టేషన్‌కు ఉదయం 6.44గంటలకు చేరుకుంటుంది.

మణుగూరు - బెల్గావి రైలు వేళలు

రాత్రి 3.40 గంటలకు మణుగురులో ఈ రైలు ప్రారంభమవుతుంది. వికారాబాద్ స్టేషన్‌కు రాత్రి 11.37గంటలకు తాండూరు స్టేషన్‌కు అర్ధరాత్రి 12.7గంటలకు సేడం స్టేషన్‌కు అర్ధరాత్రి 12.34గంటలకు, భల్గామిలో అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి సేడం స్టేషన్‌కు ఉదయం 2.34గంటలకు, తాండూరు స్టేషన్‌కు ఉదయం 2.40గంటలకు, వికారాబాద్ జంక్షన్‌కు ఉదయం 3.34గంటలకుకు చేరుకుంటుంది. తాండూరు, వికారాబాద్‌లతో పాటు సరిహద్దు రాష్ట్రం కర్ణాటక ప్రయాణికులకు తిరుపతి వేంకటేశ్వర స్వామి, భద్రాచలం సీతారామచంద్ర దేవాలయాలను సందర్శించేందుకు రైళ్లు మరింత సౌకర్యవంతంగా మారాయి. కర్ణాటక రాష్ట్రంలో సేడం, యాద్గిర్ తాండూరు వికారాబాద్ స్టేషన్‌లలో ఈ రైళ్లు ఆగనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లను దసరా, దీపావళి, చాత్, క్రిస్మస్ సంక్రాంతి సందర్భంగా ప్రవేశపెట్టినట్లు దక్షణ మధ్య రైల్వే పేర్కొంది.



దామగుండం అడవిని రక్షించుకుందాం

- ధ్వంసం కానున్న సుమారు 12 లక్షల చెట్లు
- రాడార్ స్టేషన్‌తో దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలు
- పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు

పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనంతగిరి కొండలలోని అటవీ భూములను భారత నావికాదళం ఏర్పాటు చేయనున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్‌ఎఫ్)రాడార్ స్టేషన్ కోసం కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పర్యావరణ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన 'దామగుండం విధ్వంసంపై పౌర సమాజం స్పందన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్ పర్యావరణవేత్త బాబురావు, బక్కా జడ్సన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, పాత్రికేయులు విఠల్, తులసీ చంద్,రాహుల్, తదితరులు మాట్లాడారు.

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, 'సేవ్ దామగుండం' పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా హైదరాబాద్, వైజాగ్, ఢిల్లీ, జమ్మూ, భోపాల్, వరంగల్, తదితర ప్రాంతాలతో సహా 18కి పైగా నగరాల్లో, పట్టణాలలో నిరసనలు చేపట్టామని వారు తెలిపారు. దామగుండం అడవులు జీవవైవిధ్యంతో ఉంటాయని, విలువైన వృక్షాలు, జంతుజాలం, ఔషధ మొక్కలతో సహా వందలాది అరుదైన వృక్ష జాతులు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో 2,900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేయనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలు, ప్రజలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. చుట్టుపక్కల ఇరవై గ్రామాలలో నివసిస్తున్న సుమారు అరవై వేల మంది జీవితాలపై ప్రభావితం చూపుతాయని అన్నారు. ఐదేళ్లలో 12 లక్షలకు పైగా చెట్లను నరికివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు. దామగుండం అడవులలో రాడార్ ప్రాజెక్టను కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

చకచకా ఆసుపత్రి నిర్మాణం

● ఆమనగల్లుకు కొత్త హాస్పిటల్!



చకచకా సాగుతున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. 50ఏళ్ల కింద నిర్మించిన ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. పాత భవనంలో రోగులకు, వైద్య సిబ్బందికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. పాత ఆస్పత్రి స్థానంలోనే నూతన భవనాన్ని నిర్మించాలని కొన్నేళ్లుగా స్థానికులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో నూతన భవనానికి తెలంగాణ వైద్య విధాన పరిషత్ నుంచి ప్రభుత్వం 2023 ఆగస్టు 18న రూ.17.5కోట్లు మంజూరు చేసింది. అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 2023 అక్టోబరు 1న శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తై నెలలు గడిచినా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో 2024 జూలై 10న మరోసారి ఎమ్మెల్యే నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. పాతభవనాన్ని కూల్చి అదే స్థలంలో ఆస్పత్రి నిర్మాణ పనులను చేపడుతున్నారు. మూడు ఫ్లోర్‌లకు గాను ఇప్పటి వరకు బేస్మెంట్ లెవల్ పనులు పూర్తయి గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్‌కు సిద్ధం చేశారు. ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ రవీందర్‌ల పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలి



ఎమ్మెల్యే సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ హిందువు జరుపుకునే దసరా పండగతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మీర్‌పేటలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, దశరథ్, రాములు, బాలకృష్ణ, శేఖర్‌రెడ్డి, ఆనంద్, మన్నె జయేందర్ముదిరాజ్, బర్కం వెంకటేష్, అశోక్, నవీన్ కుమార్, రాములు, సుదర్శన్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సంజీవరెడ్డి, హన్మంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్తీక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కార్తీక్‌రెడ్డిని కలిసిన నాయకులు

శంషాబాద్ రూరల్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కలిశారు. దసరా జరుపుకున్న నేపథ్యంలో సోమవారం నాయకులు గోటూరి మురళీగౌడ్, తుడుం హరి, కొమ్మూరి నవీన్‌గౌడ్, మణికంఠ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పడకల్‌లో సాయమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.3వేల సాయం అందజేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ రూ.2,500 అందజేశారు. పరామర్శించిన వారిలో చెన్నయ్య, రాంచంద్రి, గణేశ్, రమేశ్, నారయ్య, మహేశ్ ఉన్నారు.



మృతదేహం నాయకుల నివాళులు

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీవో కిష్టయ్య

కేశంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి కిష్టయ్య కోరారు. సోమవారం అల్వాలలో ఉపాధి పనుల లేబర్ బడ్జెట్, పనుల గర్తింపున కు గ్రామ సభను నిర్వహించారు. 2025-2026 సంవత్సరానికి సంబంధించిన పనులకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజలు ఉపాధి పనుల్లో తమ పొలాలు బాగుచేసుకోవడం, దారులు వేసుకోవడం వంటి పనులు చేసుకోవాలని ఎంపీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి గీత, పంచాయతీ కార్యదర్శి నదీమ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఎండీ వ్యాక్సినేషన్

కొత్తూరు/ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కొత్తూరు గ్రామీణ మండలం, మున్సిపాలిటీలో ఈ నెల 15 నుంచి పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహిస్తామని పశువైద్యాధికారి స్ఫూర్తి సోమవారం తెలిపారు. 15 నుంచి 18 వరకు తిమ్మాపూర్, పెంజర్ల, అక్కవానిగూడ, 19-22 కుమ్మరిగూడ, పెంజర్ల, కొడిచర్ల, 23-24 తీగాపూర్, కొడిచర్ల, 25న ఫాతిమాపూర్, కొడిచర్ల తండా, 26న కొత్తూర్ తండా, 28-30 కొత్తూర్, ఖాజీగూడతండా, శేరిగూడబద్రాయపల్లి, 31నుంచి నవంబరు 5 వరకు ఇన్ముల్‌నర్వ, శేరిగూడబద్రాయపల్లి, గుడూరు, మక్తగూడ, 6-9 వరకు సిద్ధాపూర్, పెద్దగుట్టతండా, గుడితండా, లోక్యాతండా, రాగ్యాతండా, 11నుంచి 14వరకు పులిచర్లకుంట తండా, వోగ్యాతండా, చింతగట్టుతండా, మల్లాపూర్‌తండా, మల్లాపూర్, రెడ్డిపాలెం గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామని పశువైద్యాధికారి వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు, పశుపెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తెలిపారు. ఆమనగల్లు మండల గ్రామాల్లో మంగళవారం నుంచి నవంబరు 14 వ తేదీ వరకు పాడిపశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాల వేస్తామని పశువైద్యాధికారి అగ్నివేశ్ తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే నోట్లో, కడుపులో, కాలిగిట్టల్లో పుండ్లు ఏర్పడి నడవలేవని, తీవ్ర జ్వరం వస్తుందని, మేత మేయవని తెలిపారు. వ్యాధి తీవ్రమైతే పశువు చనిపోతుందన్నారు. పశువుకు వ్యాధి వచ్చినా రాకున్నా టీకాలు వేయించాలన్నారు. రెండు టీంలతో టీకాలు వేస్తామన్నారు. 15, 16 తేదీల్లో ఆమనగల్లు, 17న శెట్టిపల్లి, 18న సింగంపల్లి, 19న పోలెపల్లి, 21న కొత్తకుంట తండా, 22న రాంనుంతల, రానుంతల తండా, 23న కోనాపూర్, 24న విఠాయిపల్లి, చంద్రాయన్‌పల్లితండా, 25న విఠాయిపల్లి, పెంటతండా, 26న మంగళపల్లి, 28న చింతలపల్లి, 29న మేడిగడ్డ, 30న శంకర్‌కొండ, సామాయిపల్లి, దయ్యాలబోడు తండా, నవంబరు 2న నుచ్చుగుట్ట తండా, సాకిబండ తండా, 4న ఆకుతోటపల్లి, 5న సంకటోనిపల్లి, 6న సీతారామ్‌నగర్ తండా, పులిగోనిపల్లి తండా, 7న ముర్తోజుపల్లి, 8న జంగారెడ్డిపల్లిలో టీకాలు వేస్తామని, రైతులందరూ పశువులకు టీకాలు వేయించాలని అగ్నివేశ్ కోరారు.

ట్రాన్స్‌కో ఏఈ సీతారాములుకు ఏడీఈగా ప్రమోషన్



ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్.సీతారాములుకు ఏడీఈగా ప్రమోషన్ లభించింది. ఈ మేరకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేస్తూ ఇబ్రహీంపట్నం ఏడీఈగా పోస్టింగ్ ఇచ్చారు. మూడు సంవత్సరాల పాటు సీతారాములు ఆమనగల్లు ఏఈగా సేవలందించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో రైతుల,వినియోగదారుల అభిమానం చూరగొన్నారు. కాగా ఆమనగల్లు నూతన ఏఈగా శంకర్‌నాయక్ నియమితులయ్యారు. అలాగే ఆమనగల్లు ఏడీఈ శ్రీనివాసులు తుర్కయంజాల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ నుంచి బాలకృష్ణ రానున్నారు.

క్రైం కార్నర్

దుర్గామాత విగ్రహం ఊరేగింపులో ఘర్షణ

● రెండు కేసుల నమోదు

కొత్తూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత పంచాయతీ కార్యాలయ సమీపంలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద అదివారం రాత్రి రెండు వర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో రెండు కేసులు నమోదు చేసినట్లు సోమవారం ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. దుర్గామాత ఊరేగింపు నిర్వహిస్తుండగా జంగగళ్ల అనిల్ వర్గం, కర్రోళ్ల సురేందర్ వర్గానికి చెందిన వారు ఘర్షణకు దిగి పరస్పరం దాడులు చేసుకున్నారని తెలిపారు. రెండువర్గాల ఫిర్యాదు మేరకు ఘర్షణ పడ్డ పలువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర



ఆమనగల్లులో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

కడ్తాల్/ఆమనగల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండల పరిధి ఎక్వాయిపల్లిలో సోమవారం దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి శోభాయాత్రలో భక్తులు, నాయకులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, మండల రైతు సమితి అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ ఎంపీటీసీ ఉమవతిబుగ్గయ్యగౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూజలానంతరం వేలం నిర్వహించారు.అమ్మవారి ముక్కుపుడక రూ.1.31లక్షలకు బత్తుల ఆంజనేయులుగౌడ్, లడ్డూ రూ.85వేలకు పాలకుర్ల యాదయ్యగౌడ్, లక్ష్మీదండ రూ.50వేలకు పుట్టి మల్లేశ్, పెద్ద చీర రూ.31 వేలకు లక్ష్మణ్, చిన్న చీర రూ.24వేలకు బాల్‌రాజ్‌గౌడ్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు శంకరయ్య, యాదయ్య, కరుణాకర్, సుమన్, అజీజ్, వెంకటయ్య, చోటే, చంద్రయ్య, జంగయ్య, శంకర్, నరేశ్, మల్లేశ్, రాజు, మధు, మహేశ్, చందు, శివ, యుగేందర్ పాల్గొన్నారు. ఆమనగల్లులో సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. భక్త మార్కండేయ ఆలయంలో 11రోజులు నిర్వహించిన ఉత్సవాల ముగింపు నేపథ్యంలో నిర్వహించిన ర్యాలీలో పద్మశాలి సంఘం నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై శోభాయాత్ర నిర్వహించారు. యువతీ యువకుల నృత్యాలు, మహిళల కోలాటం, దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నాయకులు ఎంగిలి బాలకృష్ణ, గాజుల శ్రీను, అప్పం శ్రీనివాస్, రమేష్, యాదగిరి, రామకృష్ణ, పద్మనాభం, రఘు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.27లక్షలు పలికిన అమ్మవారి చీర

యాచారం: నల్లవెల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో ఆదివారం రాత్రి అమ్మవారి చీరను వేలం వేశారు. ఉడతల మహేందర్‌గౌడ్ రూ.1.27లక్షలకు వేలంలో అమ్మవారి చీరను దక్కించుకున్నారు.

దుర్గామాత లడ్డూను కైవసం చేసుకున్న నారాయణరెడ్డి

మాడ్గుల: మాడ్గులలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద ఆదివారం రాత్రి అమ్మ వారి అలంకరణ వస్తువులను వేలం వేశారు. లడ్డూను ఎస్ఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సూదిని పట్టాభినారాయణరెడ్డి 5.02లక్షలకు కైవశం చేసుకున్నారు. అమ్మవారి ఉత్సవ ప్రతి మ, కలశాన్ని 1.4లక్షలకు సొంతం చేసుకున్నా రు. అలాగే అమ్మవారి ముక్కుపుడకను పల్ల విజయ్ 1.21లక్షలకు పాడుకున్నారు. లక్ష్మీ మాలను వరికుప్పల శేఖర్ రూ.లక్షకు దక్కించుకున్నారు. అమ్మవారి లడ్డూ, పట్టు చీరను గౌని రాజు రూ.20,116లకు దక్కించుకున్నారు.



యాచారం: మహేందర్‌కు సత్కారం



కడ్తాల్: ఊరేగింపులో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవి కాంత్‌గౌడ్, గ్రామస్తులు



మాడ్గుల: లడ్డూను ఎత్తుకున్న నారాయణరెడ్డి

కేఎల్లార్‌కు శుభాకాంక్షల వెల్లువ



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసిన మాజీ జడ్పీటీసీలు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, పాండురంగారెడ్డి

కందుకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండగను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం తుక్కుగూడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు లక్ష్మారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతీ వ్యక్తికి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారన్నారు. పేదలు, అర్హులు ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందేలా స్థానిక నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. పేదల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం అన్నారు. ఈ విషయంలో తాను అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని, నియోజకవర్గంలో మన పార్టీ గెలవకున్నా ప్రజా సేవల్లో మాత్రం ముందుండాలని ఆయన సూచించారు. లక్ష్మారెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణానాయక్, నాయకులు అందుగుల సత్యనారాయణ, రాకేష్‌గౌడ్, బాబురావు, గణేశ్‌నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద గోల్కొండ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కె.రవీందర్‌ను కార్యాలయంలో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనెగౌని శ్రీధర్‌గౌడ్, ఎం.భోజిరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, చిరంజీవి, బి.శ్రీశైలం, సి.శ్రీనివాస్, దేవేందర్, రాజశేఖర్‌రెడ్డి, మధు, ఆరిఫ్ ఉన్నారు.



తహసీల్దార్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మినీ స్టేడియం నిర్మాణం ఎప్పుడో?

● ఆమనగల్లులో స్టేడియం లేక ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
● ప్రతిపాదనలకే స్టేడియం పరిమితం
● విద్యార్థులకు స్థానికంగా శిక్షణ కరువు
● అమలు కాని నేతల హామీలు



క్రీడా మైదానం లేక పొలాల సమీపంలో ఖోఖో ఆడుతున్న బాలికలు(ఫైల్)

ఆమనగల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియాలు నిర్మిస్తామన్న ప్రభుత్వ, పాలక ప్రజాప్రతినిధుల ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో క్రీడాకారులు, విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం, శిక్షణ లేక నిరుత్సాహానికి లోనవుతున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులుండి విద్యా పరంగా అభివృద్ధి చెందిన ఆమనగల్లులో మినీ స్టేడియ నిర్మాణం కలగానే మిగిలింది. ఆమనగల్లు పట్టణం నాలుగు మండలాలకు కూడలిగా ఉంది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కడ్తాల మండలాల పరిధిల్లోని సుమారు 5వేల మంది వరకు విద్యార్థులు ఆమనగల్లులోని వివిధ పాఠశాలలు, కాలేజీల్లో చదువుతున్నారు. ఈ ప్రాంతంలో ఎందరో జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులున్నారు. పాఠశాలవిద్యార్థుల్లోనూ ప్రతిభావంతులు ఉన్నారు. పట్టణంలో క్రీడలకు ప్రత్యేక స్థలమంటూ లేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడాస్థలం లేని కారణంగా క్రీడల నిర్వాహణకు సైతం ఎవరూ ముందుకు రావడం లేదు. క్రీడలపై ఆసక్తి ఉన్నా క్రీడాస్థలం లేక విద్యార్థులు, యువత ఆట టలు ఆడలేకపోతున్నారు.

ప్రకటనలకే నేతల మాటలు పరిమితం

పట్టణంలో గతంలో క్రీడాపోటీలు నిర్వహించిన సందర్భాల్లో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు వచ్చిన నేతలు, అధికారులు ఆమనగల్లులో మినీ స్టేడియం నిర్మాణానికి హామీ ఇచ్చి వెళ్లారే తప్ప వాటి మాటలు కార్యరూపం దాల్చలేదు. ఆమనగల్లులోని పాఠశాలల ఆవరణల్లోనూ తగిన స్థలం లేక విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. సెలవు దినాలు, సాయంత్రం వేళల్లో ఆటలు ఆడుతున్నారు. క్రీడా స్థలం లేక చివరకు పట్టణ సమీప వ్యవసాయ భూముల్లో, పిల్లలైతే ఇళ్ల మధ్య రోడ్లపై ఆడుకుంటున్నారు. ఆమనగల్లులో అనేక చోట్ల మినీ స్టేడియానికి అవసరమైన స్థలాలున్నా ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయడం లేదు. ఆమనగల్లులో మినీ స్టేడియం నిర్మిస్తే ఐదు మండలాల క్రీడాకారులు, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఇరుకైన పాఠశాల గ్రౌండ్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

క్రీడాకారులకు ప్రోత్సాహమివ్వాలి



ప్రతీ మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేసి క్రీడల్లో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించాలి. ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. ఐదు మండలాల కూడలిగా ఉన్న ఆమనగల్లులో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి. కాలేజీ, పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. స్టేడియం ఏర్పాటు చేస్తే క్రీడాపోటీల నిర్వాహణకు, శిక్షణకు దోహద పడుతుంది. క్రీడాకారులకు ప్రోత్సాహం లేక, శిక్షణ కరువై క్రీడల్లో రాణించలేకపోతున్నారు.

- శ్రీకాంత్‌సింగ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఆమనగల్లులో మినీ స్టేడియం ఏర్పాటు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులు స్టేడియం ఏర్పాటుకు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలి. క్రీడాకారులు శిక్షణ పొందే అవకాశం ఉంటుంది.

- వొగ్గు మహేశ్, ఆమనగల్లు

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తలకొండపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్‌లోని చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం పద్మశాలి సంఘ సమావేశాన్ని నిర్వహించారు. భక్తమార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుకుడాల మల్లేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, మధు, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాడిగె నరేశ్, కోశాధికారి మ్యాకం గణేశ్, సహాయ కార్యదర్శులు రాకేశ్,శశికుమార్, సలహాదారులు పాండయ్య, జనార్దన్, వీరేశలింగం, శివరాజు, గౌరవాధ్యక్షుడు చంద్రకుమార్, గౌరవ ఉపాధ్యక్షులు రాజలింగం, నర్సింహులు, కార్యవర్గ సభ్యులు రఘు, రమేశ్, రాజేశ్, ప్రవీణ్, నరేశ్, ప్రసాద్, శ్రీకాంత్, భీమనపల్లి కిశోర్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని సంఘం నాయకులు సత్కరించారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

శంకర్‌పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో దుర్గామాత విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆందోళనలు చేస్తారని పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్, రంగనాథ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం విడుదల చేశారు.



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు